క్లుప్తంగా...

విగ్రహ ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్



మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్దార్ పటేల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విగ్రహావిష్కరణకు హాజరవుతారని ఆ లోపు ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయండి



మణిక్‌రావు థాక్రేను కలిసి సురేష్‌యాదవ్

గౌతంనగర్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తెలంగాణ ఇంచార్జి మాణిక్‌రావు థాక్రేను మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోనగిరి సురేష్‌యాదవ్ శనివారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అందరు కృషి చేయాలని థాక్రే సూచించినట్లు సురేష్ యాదవ్ తెలిపారు.

ఘనంగా సుపరిపాలన వేడుకలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో తెలంగాణ సుపరిపాలన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన పరిపాలనా సంస్కరణల ద్వారా జరిగేమేలు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజకు సుపరిపాలన అందించడమే కేసీఆర్ లక్ష్యం అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం చిరస్థాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి భావిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... భూదేవినగర్‌లో నివాసముండే శివకుమార్(21) శనివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై కొంపల్లి నుండి బొల్లారం వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనం పై ఉన్న శివకుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతు శివకుమార్ మృతి చెందాడు.

లోక్‌అదాలత్‌లో 33వేల కేసులు పరిష్కారం

అల్వాల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ మధుసూదన్ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 19 బెంచులలో 33,225 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ. 59,81,505 పరిహారం కింద చెల్లించారు.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్



శిథిలావస్థకు చేరిన ఓపెన్ జిమ్

రామంతాపూర్: ప్రజల ఆరోగ్యం కోసం ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు నిధులు వెచ్చించి రామంతాపూర్ చిన్న చెరువు మైదానంలో మూడేళ్ల క్రితం వివిధ వ్యాయామ పరికరాలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ జిమ్ పరికరాలు నాసిరకంగానూ నాణ్యత లేకపోవడం తగినంత గేజ్ (మందం)గా లేకపోవడం , గట్టిగా పట్టుకుని వ్యాయామం చేస్తే విరిగిపోయే విధంగా పనికి రాకుండా పోయాయని బహుశా ఎక్కడో పాత బడిన జిమ్ పరికరాలను తెచ్చి ఇక్కడ ఏర్పాటు చేసి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిమ్ ఏర్పాటు చేసి సంవత్సరం గడిచిన తరువాత అతివేగంగా ఓ కారు జిమ్ ప్రాంగణంలోకి దూసుకువచ్చి వ్యాయామం పరికరాలను ఢీకొట్టడంతో పలు పరికరాలు ధ్వంసమై వ్యాయామానికి పనికి రాకుండా పోయాయి. ప్రతిరోజు చెరువు మైదానంలో వాకింగ్ కోసం వచ్చే వారుకాసేపువ్యాయామం చేస్తూ ఉంటారు. వ్యాయామ పరికరాలు పనికి రాకుండా పోవడంతో వారు నిరాశతో వెను దిరుగుతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లో నూతన పరికరాలను అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త జిమ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం



చిన్న చెరువు గ్రౌండ్‌లో ఉన్న ఓపెన్ జిమ్ వ్యాయామ పరికరాలు నాసిరకంగానూ నాణ్యత లేకుండా ఉన్నాయి అనే మాట వాస్తవం. మూడేళ్ళకే పరికరాలన్నీ ఒక్కొక్కటి వ్యాయామం చేయడానికి పనికి రాకుండా పోయాయి. ఈ పరికరాలను తొలగించి కొత్త జిమ్ ఏర్పాటు చేయాలని అధికారుల దష్టికి తీసుకువెళ్లి ప్రతిపాదన కూడా సిద్ధం చేసి పంపాము. నిధులు మంజూరు కాగానే కొత్త జిమ్‌ను ఏర్పాటు చేస్తాం. – బండారు శ్రీవాణి వెంకట్రావ్, డివిజన్ కార్పొరేటర్

మౌలిక వసతుల కల్పనకు కృషి



– ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీలలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మల్కాజిగిరి శాసన సభ్యులు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం అల్వాల్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్, భారతినగర్ లలో ఆయన స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పై కాలనీల నుండి ప్రవహించే వర్షపునీరు, మురుగు నీరు శ్రీనివాసనగర్ కలనీ నుండి బయిటి వెళ్ళక చెరువుగా తయారై రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది కలిగిస్తుందని, అదే కాలనీలో ప్రైవేటు పాఠశాల ఉండడం వల్ల విద్యార్థులకు అసౌకర్యంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు తెలిపారు. రెండు మ్యాన్‌హోల్స్ ఉండి కూడా మురుగునీరు బయిటికి వెళ్ళక, బాక్స్ డ్రైన్ ఆవశ్యకత ఉందని తెలిపారు. భారతినగర్‌లో కూడా డ్రైనేజీ, అంతర్గత రోడ్లు ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఈ. ప్రశాంతి, విజయరామారావు, సుదీర్ కాలనీ వాసులు మధుసూదన్‌రెడ్డి, హరినాథ్‌రావు, వైకుంతవాస, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దమాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుతోనే సుపరిపాలన

– మంత్రి మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్, జిల్లా: నూతనంగా జిల్లాలు ఏర్పడిన తర్వాతనే ప్రజలకు మంచి పాలన అందుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించేందుకు ఆయా శాఖలను పునర్వ్యవస్థీకరించి, సిబ్బందితో పాటు అధికారాలు, అవసరమైన నిధులు అందజేస్తూ బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని అన్నారు. 2016 అక్టోబర్ 11న నూతన జిల్లాగా ఏర్పాటు చేశారని అప్పటి నుంచి అన్ని రంగాల్లో రాష్ట్రంలో మేడ్చల్ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలలో రూ.69 కోట్లతో అభివృద్ధి చేశామని, ఇది ఎంతో ఆనందకరమైన విషయమని మల్లారెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ శరత్ చంద్రారెడ్డి,జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జడ్పి సీఈఓ,దేవా సహాయం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మల్లికార్జున నగర్, శేషసాయినగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే సుభాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.కాలనీల్లో నేటికి మంచి నీటి సమస్య, పురాతన డ్రైనేజి వ్యవస్థ, పలు పైపులైన్ల మార్పు తదితర అంశాలతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

మల్లాపూర్: నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో శనివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి మేనేజ్‌మెంట్ సహకారంతో ఆయా సంస్థల ఉద్యోగులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీపీఎస్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్ట్యూట్ ఛైర్మన్ మల్క కొమురయ్య విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు.

మంత్రికి హోమియోపతిక్ ఫిజీషియన్స్ ఆహ్వానం

ఉప్పల్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఈ నెల 25న రామంతాపూర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర మూడవ హోమియో వైద్యుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి తన్నీరు హరీష్ రావుకు ప్రతినిధులు ఆహ్వానం అందజేసారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

అల్వాల్: కులధ్రువీకరణ, ఆదాయ పత్రాల కొరకు దరఖాస్తుదారులు దళారులను నమ్మి పోసపోవద్దని మల్కాజిగిరి తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. పత్రాలకు కోసం ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని మీ సేవా సెంటర్‌లో నామ మాత్రపు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తులను పరిశీలించి అందజేస్తామని తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ చౌరస్తాలో నిర్మిస్తున్న అమరవీరుల స్థూపానికి శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల త్యాగాలు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అల్వాల్: అల్వాల్ హిల్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గం శనివారం ఎన్నిక అయింది. 2023–2025 సంవత్సరాల కాలానికి గాను అల్వాల్ హిల్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా వంచ భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దొంతినేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఏనుగు శ్రీనివాస్‌రావు, విశ్వకర్మ రమేష్, కోశాధికారిగా కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి కళాక్షేత్రం గురువు వసుధ మాగంటి శిష్య బృందం నిర్వహించిన నృత్యం ఆద్యంతం అలరించింది. అనంతరం నాట్యాచార్య శ్రీ పసుమర్తి శేషు బాబు, చింత శివ ఆదినారాయణలు కళాకారులను సత్కరించారు.

పింఛన్ మొత్తం పెంపు పట్ల హర్షం



మల్కాజిగిరి: దివ్యాంగులకు పింఛను మొత్తం పెంచడం పట్ల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. శనివారం మల్కాజిగిరి గాం. దీపార్కులో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ మందక్రిష్ణ మాదిగ పోరాటం ఫలితం వలన ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని పెంచిందన్నారు.అర్హులైన దివ్యాంగులకు క్రొత్త ఫించన్లు మంజూరు చేయాల్సిన భాద్యత ప్రభుత్వం పై ఉందన్నారు. కార్యక్రమంలో శాంతాబాయి,మల్లేష్,రేవతి, సురేష్‌కుమార్,చారి,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దేవుడు సీఎం కేసీఆర్



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

రామంతాపూర్ : రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ ప్రతినెలా అందజేస్తున్న ఆసరా వెయ్యి రూపాయలు పెంచుతూ మొత్తం రూ. 4166 ప్రతినెల అందజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా శనివారం రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు దివ్యాంగులతో కలిసి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల బతుకుల్లో వెలుగు నింపుతూ సీఎం వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచి దివ్యాంగులకు దేవుడుగా మారారని అన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, బాలకష్ణ, సరిత, శంకర్, ఫాతిమా, నరేష్, శైలజ, యాదగిరి, శ్రావణ్ కుమార్, పద్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

మల్లాపూర్: నాచారం డివిజన్ రాఘవేంద్రనగర్‌లోని శాంతిగార్డెన్స్ వద్ద వర్షపు నీరు నిలవకుండా చేపట్టిన వర్షపు నీటి పైపులైన్ పనులను శనివారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ పనులు నిర్లక్ష్యంగా జరుపుతున్నాయని నాణ్యతలేని పనులు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. పైపులైన్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిజెన్‌శేఖర్, ముత్యంరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ భవన్స్ పాఠశాల వద్ద రూ. 29 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ బిఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, నాయకులు ఎస్సార్. ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, శివ, కెవి. రావు, చౌదరి, ప్రకాష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ విజేత సాయి కృష్ణకు సత్కారం



సాయికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

రామంతాపూర్ ఇటీవల ప్రకటించిన ఆలిండియా సివిల్ సర్వీస్ పరీక్షల్లో 94వ ర్యాంకు సాధించి విజేతగా నిలిచిన ఆవుల సాయికృష్ణ పటేల్‌ను శనివారం రామంతాపూర్‌లో మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు ట్రస్ట్ బోర్డు మెంబర్ ఎడ్ల రవి పటేల్, అంజయ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.

12న 2కే రన్

మేడిపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న పీర్జాదిగూడలో జరిగే 2కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు శనివారం మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఏవీ కన్‌స్ట్రక్షన్ గ్రౌండ్ నుండి మొదలై డెకత్లన్ వరకు కొసాగుతుందని మేయర్ తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్,రాచకొండ పోలీస్ కమీషనర్ చౌహాన్ తదితరులు హాజరవుతారన్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు బాబానగర్, రవీంద్రనగర్, రాఘవేంద్రనగర్, దుర్గానగర్, కార్తికేయనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ నాగరాజు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



మౌలాలి: మౌలాలి డివిజన్ భరత్‌నగర్‌లోని పోచమ్మ దేవాలయం వద్ద నందకంటి శ్రావణ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 108 మంది ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, వంశీ ముదిరాజ్, మనోహర్, రవిముదిరాజ్, కిరణ్, శంకర్, ఎల్లం, రామ్‌చందర్, ఉమేష్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, సంతోష్ ముదిరాజ్, రాములు, శ్రీనివాస్‌యాదవ్, సూర్యప్రకాష్, బుచ్చిబాబు, వేణు, విఠల్, భాగ్యరాణి, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

హబ్సిగూడ: రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసే చర్లపల్లి పోలీస్‌స్టేషన్, ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, కాటేపల్లి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు గాయత్రీదేవి గుడిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పోచారం: అన్నోజిగూడలోని శ్రీగాయత్రీదేవి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రాతఃకాల పూజతో ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందులో భాగంగా మాధవానంద సరస్వతీ స్వామిచే యంత్ర ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

పీహెచ్‌సీ.. అధ్వాన్న స్థితి..

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ల్యాబ్‌లకు నర్సులే దిక్కు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగులు
- సీజనల్ వ్యాధులు మొదలయ్యే వేళ..
- వెంటనే స్పందించాలని డిమాండ్

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని కుషాయిగూడ పీహెచ్‌సీ దయనీయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అందులోనూ టీ-హబ్‌లో భాగంగా ఏర్పాటు చేసి ల్యాబ్ పరిస్థితి మరీ దారుణంగా మారింది. 20 రోజులుగా ల్యాబ్ టెక్నీషియన్ లేకుండానే కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఆర్భాటంగా ఆరంభం..

పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం టీ-హబ్ ద్వారా ఈసీజీ, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో గతంలో చేసే 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తోడు అదనంగా టీ-హబ్ ద్వారా మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు సంతోషించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మొదటగా రెండు ఆస్పత్రుల్లో మాత్రమే టీ-హబ్ పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి స్థానిక ప్రజలకు మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన సమయం, ఖర్చు ఆదా కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఆరు నెలల ముచ్చట అన్నట్లుగా ఈ టీ-హబ్ పరిస్థితి తయారైంది.

వాళ్లు లేరు.. వీళ్లు లేరు..

జమ్మిగడ్డలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో స్టాఫ్ నర్సుల ద్వారా పరీక్షలు చేయిస్తున్నారు. అటు స్కానింగ్ సెంటర్ పరిస్థితి అంతే. టీ-హబ్ ఏర్పాటు చేసిన మొదట్లో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లతో వైద్య పరీక్షలు నిర్వహించేవారు. కొద్ది రోజుల క్రితం ఒకరు బదిలీపై



పీహెచ్‌సీలోని టీ-హబ్ ద్వారా ఏర్పాటు చేసిన స్కానింగ్ సెంటర్



జమ్మిగడ్డ పీహెచ్‌సీ

వెళ్లడంతో ఒక్కరితోనే నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న ఒక్కరు కూడా బదిలీపై వెళ్లడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన టీ-హబ్ సిబ్బంది లేక నిరుపయోగంగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

గతంలో ఈ పీహెచ్‌సీలో ఓ వైద్యాధికారి, మరో సహ వైద్యాధికారి ఉండే వారు. అనంతరం బదిలీలతో ఇతర పీహెచ్‌సీ వైద్యులకు, బస్తీదవాఖానా వైద్యులకు అదనపు బాధ్యతలతో నెట్టుకొచ్చారు. అనంతరం జరిగిన పరిణామాలతో ప్రస్తుతం ఒక వైద్యాధికారి మాత్రమే ఉన్నారు. ఒక పీహెచ్‌సీకి కనీసం ముగ్గురు ఆయాలు ఉండాలి. కానీ ఇక్కడ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆమె కూడా మరో ఆస్పత్రికి చెందిన ఆయా.. కానీ ఇక్కడ ఎవరూ లేకపోవడంతో తనను ఇక్కడ కొనసాగిస్తున్నట్లు తెలిసిన సమాచారం.

ఎందుకింత దయనీయం?

నిరుపేదల వైద్యానికి కొండంత అండగా ఉన్న ఈ పీహెచ్‌సీకి ఎందుకింత దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరు మాత్రమే విధులు నిర్వహించడం. కనీసం ముగ్గురు ఆయాలు ఉండాల్సిన చోట ఒక్కరు మాత్రమే ఉండటం. ఇక టీ-హబ్, ల్యాబ్ పరిస్థితి మరింత ఘోరం. ల్యాబ్ టెక్నీషియన్ లేక స్టాఫ్ నర్సులతో వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక రేడియాలజిస్ట్ లేక గర్భిణులను వెనక్కి పంపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడి సమస్యలు ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి, పీహెచ్‌సీ దయనీయ స్థితికి అద్దంపడుతోంది.

తీవ్ర ఇబ్బందుల్లో గర్భిణులు

జమ్మిగడ్డ పీహెచ్‌సీలో గతేడాది నవంబర్ నుంచి ప్రసవాలు కూడా ప్రారంభమయ్యాయి. రానురాను నిత్యం ఆస్పత్రికి గర్భిణుల సంఖ్య కూడా పెరిగింది. ప్రస్తుతం పీహెచ్‌సీలో కనీసం వారానికి ఒకటి, రెండు ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణులకు అవసరాన్ని బట్టి రెండో నెల నుంచే స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. రోజుకు కనీసం 30 నుంచి 40 మంది వరకు స్కానింగ్ కోసం వచ్చేవారు. గర్భిణులే కాకుండా మహిళలకు సంబంధించిన నెలసరి సమస్యలు, పీసీఓడీ సమస్యలు, కిడ్నీలో స్టోన్స్ సమస్యలు ఇలా ఎంతో మంది ఇక్కడ పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వస్తుంటారు. మరి ఉన్న రేడియాలజిస్టును కూడా బదిలీపై పంపడంతో స్థానికులు, మరీ ముఖ్యంగా గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రేడియాలజిస్ట్ బదిలీపై అనుమానాలు..

జమ్మిగడ్డలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన టీ-హబ్‌ను ఇక్కడి నుంచి తరలించేందుకు కృత్రిమంగా సిబ్బంది కొరత సృష్టిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇద్దరు ఉన్నచోట ఒక్కరితో, ఆ తరువాత ఇప్పుడు ఉన్న ఒక్కరినీ బదిలీపై పంపడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడున్న రేడియాలజిస్టును మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రికి బదిలీ చేశారు. అక్కడ అప్పటికే ఒకరు విధులు నిర్వహిస్తుండగా ఇక్కడ కృత్రిమంగా కొరత సృష్టించి అక్కడికి పంపాల్సిన అవసరమేంటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీని వెనుక అసలు రహస్యం టీ-హబ్‌ను మొత్తానికే జమ్మిగడ్డ ప్రాంతం నుంచి తరలించాలనే ఉద్దేశంతో రేడియాలజిస్టును మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రికి బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఇక్కడ దుస్థితి ఇలా ఉంటే ఎలా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



పీర్జాదిగూడలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాలు అంబరాన్నంటాయి. పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల పనితీరు చూశామని, వారి పరిపాలనలో పేదలను కొట్టి పెద్దలకు పెడుతున్నారని ఆరోపించారు. దేశంలోనే ఎక్కడా లేని పథకాలకు తెలంగాణాలోనే ఉన్నాయన్నారు. అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శవంతంగా నిలుస్తోందన్నారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అంటేనే సకలజనుల సంక్షేమం అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మన పీర్జాదిగూడ కార్పొరేషన్ నేడు రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా కీర్తి సాధించడంలో ప్రజల భాగసామ్యం మరువలేమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే సీఎం ధ్యేయం

రామంతాపూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రామంతాపూర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించి నియోజకవర్గంలోని 332 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిది ఏళ్లుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏ ఆసరా లేని ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, దశాబ్ది ఉత్సవాల కమిటీ చైర్మన్ అరుణకుమారి, తహసీల్దార్ గౌతమ్ కుమార్, అధికారులు రమాదేవి, నాగేందర్, చందన, టీఆర్‌ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరికె సుధాకర్, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

సంక్షేమ పథకాలే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

మల్కాజిగిరి: సంక్షేమ పథకాలే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. బాలాజీ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంక్షేమ సంబురాలు, లబ్ధిదారులతో సమావేశం మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారికి చేయూత అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతాయాదవ్, మీనారెడ్డి, అల్వాల్ డీసీ నాగమణి, బీసీ విభాగం అధికారి పాండు, పీవో మల్లికార్జున్, నాయకులు జగదీష్‌గౌడ్, జీఎస్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, ఉపేందర్‌రెడ్డి, బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కబ్జాలను తొలగించాలని వినతి

అల్వాల్: అల్వాల్ మండలం యాప్రాల్ సర్వే నంబర్-171 ప్రభుత్వ భూముల్లో కబ్జాలు తొలగించాలని కోరుతూ శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు సీపీఐ శ్రేణులు ఎస్.బాలమల్లేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. యాప్రాల్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఆయనను సీపీఐ నేతలు కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడుతూ సర్వే నంబర్ 171 ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు తొలగించి, భూమిని సర్వే చేసి కంచె వేయాలని కోరారు. అలాగే యాప్రాల్ బండ బయికుంట, నాగిరెడ్డి చెరువు, కొకూర్ సర్వే నెంబర్ 27లోని ప్రభుత్వ భూములు, బఫర్ జోన్లు అన్యాకాంతం అవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు సహదేవ్, చంద్రయ్య, జంగయ్య, స్వామి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

యాప్రాల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ రాఘవ కళ్యాణ్, శ్రీఎన్‌క్లేవ్, సిబిఆర్ కృష్ణవేణి ఎస్టేట్స్‌లో రూ.56 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు

బోడుప్పల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాలులో తెలంగాణ సంక్షేమ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ హాజరై పలువురు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో అందిస్తున్న ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్, పలు సంక్షేమ పథకాల వివరాలను బోడుప్పల్ కార్పొరేషన్ మేనేజర్ మంజులత తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి కృపాసాగర్, సుగుణబాలయ్య, సింగిరెడ్డి పద్మారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





బోడుప్పల్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న డిప్యూటీ మేయర్ లక్ష్మీరవిగౌడ్

ప్రజాగర్జనను జయప్రదం చేయండి

అల్వాల్: దేశంలోని, రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సింగరేణి తదితర ప్రభుత్వరంగ పరిశ్రమలను, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణకు ఈనెల 11న కొత్తగూడెంలో జరుగే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన యాప్రాల్‌లో ఆవిష్కరించారు.

అనుమానాస్పదంగా కుక్కల మృతి

రామంతాపూర్: రామంతాపూర్ నెహ్రూనగర్‌లోని గంగపుత్ర సంఘం ఎదురు వీధిలో అనుమానాస్పదంగా రెండు కుక్కలు మృతి చెంది ఉన్నాయి. గురువారం రాత్రి చనిపోయి ఉండవచ్చని, ఏదైనా విష పదార్థాలు తిని ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. కాలనీలో కుక్కలు చనిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసిన వారే లేరు.

నిధులు మంజూరు చేయాలని వినతి



జోనల్ కమిషనర్ పంకజతో చర్చిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై శుక్రవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి చర్చించారు. నాచారం ఎర్రకుంటలోని హిందూ శ్మశానవాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు, భవానీనగర్ కాలనీ కమ్యూనిటీహాలుపై ఒక అంతస్తు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ స్పందిస్తూ నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హబ్సిగూడ: టీపీసీసీ మైనార్టీస్ డిపార్టుమెంట్ జనరల్ సెక్రటరీగా హబ్సిగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజయ్ జైన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హబ్సిగూడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం సంజయ్ జైన్‌కు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రషీద్ ఆషు, గణేష్‌నాయక్, వంజరి సంతోష్, సాయిబాబా, కిషన్ నాయక్, మల్లేష్ యాదవ్, చందుయాదవ్, నరేష్, రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆర్టీసీ సేవలు



ఈసీఐఎల్ బస్టాండ్‌లో విలేజ్ బస్ ఆఫీసర్ల సేవలను ప్రారంభిస్తూ..

కాప్రా: ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు అందించేందుకు ఆర్టీసీ అడుగులు వేస్తోందని కుషాయిగూడ డిపో మేనేజర్ పి.చంద్రకాంత్ అన్నారు. శుక్రవారం ఈసీఐఎల్ బస్టాండ్‌లో ఆర్టీసీ ద్వారా నియమించిన విలేజ్ బస్ ఆఫీసర్ల సేవలను ఓయూ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎన్.నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారికి ఐడీ కార్డులు, బట్టలు, బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రజిత, బాల్‌రెడ్డి, విలేజ్ ఆఫీసర్లు, వెల్ఫేర్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

18న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

మేడిపల్లి: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కొనసాగింపుగా 18వ తేదీన నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ విజ్ఞప్తి చేశారు. పీర్జాదిగూడలోని ఓ కళాశాలలో డాక్టర్ కోట నీలిమ బ్రోచర్‌ను విద్యార్థులకు అందజేసి రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, రెండో బహుమతిగా స్మార్ట్‌ఫోన్, మూడో బహుమతిగా టాబ్లెట్, పది కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనే వారు ఫోన్: 76618 99899కు మిస్డ్‌కాల్ ఇచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.



విద్యార్థులకు బ్రోచర్ అందజేస్తున్న డాక్టర్ కోట నీలిమ

చికిత్స పొందుతున్న ఖైదీ మృతి

కుషాయిగూడ: చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన అబ్దుల్ కరీం40) మర్డర్ కేసుతో పాటు పలు చోరీ కేసుల్లో నిందితుడు. నిజామాబాద్ జిల్లాలో శిక్షణ అనుభవిస్తున్న అతడిని ఈ నెల 1వ తేదీన చర్లపల్లి జైలుకు తరలించారు. మానసిక పరిస్థితి బాగోలేని అతడు జైలుకు వచ్చినప్పటి నుంచి అతడికి సంజీవినిలో వైద్యం అందిస్తూనే ఉన్నారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శుక్రవారం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జైలు పర్యవేక్షణ అధికారి సంతోష్ కుమార్ రాయ్ తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య



వినోద్‌కుమార్ (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

మల్కాజిగిరి: ఆరోగ్య ఇబ్బందులతో మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం గడ్డమల్లిగూడెంకు చెందిన అర్ల వినోద్‌కుమార్(27) మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో సెలవులో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో పాటు ఎస్ఐలు, సిబ్బంది నివాళులర్పించారు. రాచకొండ కమిషనర్ అంత్యక్రియల కోసం రూ.70 వేలను అందజేశారు.